

గాయపడిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ

సిద్ధం అరాచకానికా?

'సిద్ధం' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలు పెట్టేది మీడియాపై అరాచకం చేసేందుకా?.. అని నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన వైసీపీ 'సిద్ధం' సభ కవరేజీ కోసం వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల విచక్షణరహిత దాడిని ఖండించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన దాడి దృశ్యాలను చూసిన వీరంతా దిగ్భ్రమ చెందారు. ఇలాంటి అమానుష చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు చేయాలేగానీ ఇలా దాడులకు దిగడం సరికాదని హితవు పలికారు. ఈ దాడులకు నిరసనగా సోమవారం జిల్లా అంతటా నిరసనలు, ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు.



తిరుపతిలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

● రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించిన పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు

తిరుపతిలో టీడీపీ శ్రేణుల నిరసన

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక భవానీ నగర్ సర్కిల్లో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మీడియాపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. వీధి రౌడీల్లా దాడులకు దిగిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే మీడియా గొంతు నొక్కడం సరికాదన్నారు. దాడుల సంస్కృతిని మానుకోవాలని, మరో రెండు నెలల్లో వైసీపీ రౌడీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, పార్లమెంటు అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, నాయకులు ఆర్సీ శ్రీనివాస్, సుబ్బు యాదవ్, శ్రీరాములు, జగ్గా, శంకర్ యాదవ్, ధనంజయ, సుజాత, తోట వాసు, జిమ్ ప్రకాష్, శరత్, హేమంత్, శ్రీకాంత్, వెంకటరెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి



పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఏపీని అరాచక ప్రదేశ్‌గా మార్చిన జగన్ రెడ్డిపై విచారణ జరిపించాలి.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ అధికార ప్రతినిధి

భౌతికదాడులను అందరూ ఖండించాలి



వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్న వ్యక్తిపై భౌతికదాడులా? వైసీపీ నాయకులు వాళ్ల వైఖరి మార్చుకోవాలి. చంద్రగిరి నియోజకవర్గంలో కూడా పలుసార్లు విలేకరులపై దాడులు జరిగాయి. ఇటువంటి దాడులను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది. నిజాలు నిర్భయంగా చెప్పాలన్నా, రాయాలన్నా విలేకరులకు స్వేచ్ఛ ఉండాలి.

- పులివర్తి నాని, టీడీపీ చంద్రగిరి ఇన్‌చార్జి

తిరుపతిలో నేడు ఏపీయూడబ్ల్యూజే నిరసన

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ సోమవారం ఉదయం 10.30గంటలకు తిరుపతిలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్నట్టు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నరేంద్రలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విధులు నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. శాంతియుతంగా నిర్వహించనున్న నిరసనకు జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొనాలని కోరారు. అలాగే ఏపీ జర్నలిస్టు ఫోరం ఉమ్మడి చిత్తూరు జిల్లా నేత హరిబాబు కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

ఇలాంటి ఉన్మాద చర్యలకు భయపడం

ఫొటో జర్నలిస్టు అసోసియేషన్

సీఎం సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన ఉన్మాద చర్యలకు ఫొటోగ్రాఫర్లు భయపడే ప్రసక్తే లేదని ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఆ అసోసియేషన్ నాయకులు కాళహస్తి గిరిబాబు, రాధాకృష్ణ, లావణ్యకుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దాడి అమానుషం



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుషం. దాడి దృశ్యాలు చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అన్న అనుమానం కలుగుతోంది. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఈ ఘటన వైసీపీ రాక్షస పాలనకు అద్దం పడుతోంది. నిందితులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి.

- కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే

దాడి దారుణం



సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణం. వైసీపీ ప్రభుత్వంలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. పత్రికా స్వేచ్ఛను హరించేలా వైసీపీ కార్యకర్తలు గూండాల్లా ప్రవర్తిస్తున్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పాశం సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యమా.. ఆటవిక రాజ్యమా?



ఫొటోగ్రాఫర్‌పై అమానుషంగా దాడిచేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఇలాంటివి ఏ రాజకీయ పార్టీకి మంచిది కాదు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పార్టీ నాయకులపై ఉంది. ఈవిధానం మంచిది కాదు. సహనం నశించిపోతే ప్రజలు తిరగబడే రోజు దగ్గరలో ఉంది. ప్రకృతి చాలా గొప్పది. బలవంతుడు బలహీనుడిని కొడితే, బలవంతుడిని భగవంతుడు కొడతాడు. ఇది సత్యం.

- నవీన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ పోరాట సమితి కన్వీనర్

ప్రజాస్వామ్యం ఖూనీ



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. ఇంత దారుణ పరిస్థితులు రాష్ట్రంలో ఎన్నడూ చూడలేదు. వృత్తి ధర్మంలో భాగంగా విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు ఇంత క్రూరంగా ప్రవర్తించడం బాధాకరం.

- బొజ్జల సుధీర్ రెడ్డి, టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జి

వైసీపీ నాయకులా? వీధి రౌడీలా?



వైసీపీ నాయకులా? వీధి రౌడీలా? అర్థం కావడం లేదు. ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖ రాయనున్నాం. సీఎం ప్రసంగిస్తుండగా.. పోలీసులు చూస్తుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై పైశాచికంగా దాడిచేయడం దారుణం. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మీడియాపై జరిగిన దాడులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.

- నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిని జనసేన తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. పైగా బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీకి రోజులు సమీపించాయి. ఇలాంటి దాడులపై ప్రతీకారం తప్పక ఉంటుంది. రాష్ట్రాన్ని అరాచక ప్రదేశ్‌గా మార్చిన జగన్ రెడ్డిపై విచారణ జరిపించాలి.

- కిరణ్ రాయల్, తిరుపతి జనసేన ఇన్‌చార్జి

దాడులు మంచి పద్ధతి కాదు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై అధికార పార్టీ కార్యకర్తలు పాశవికంగా భౌతిక దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రతికారంగాన్ని అధికారంలో ఉన్నవారు గౌరవించే సంప్రదాయాన్ని పాటించకుండా దాడులు చేయడం మంచి పద్ధతి కాదు. ఫొటోగ్రాఫర్ వృత్తిధర్మాన్ని పాటించారే కానీ, వ్యక్తిగత కక్షలకు రాలేదన్న స్పృహ ఉండాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికార పార్టీ నాయకులు సంయమనం పాటించాలి.

- రాకేష్‌రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



తుమ్మలగుంట చెరువులో జరిగిన నిర్మాణాలు

తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై కొరడా?

● తొలగించాల్సిందేనన్న ఎన్జీటీ

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో అనధికారిక నిర్మాణాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కొరడా ఝుళిపించింది. చెరువు స్వరూపాన్ని మార్చిన వారిపై చర్యలు తీసుకొని, నిర్మాణాలను తొలగించాలని సూచించినట్టు తెలుస్తోంది. దీనిపై ఏప్రిల్ 23వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలితోపాటు కలెక్టరును ఆదేశించినట్టు సమాచారం. దీంతో తుడా అధికారులు నివేదిక సమర్పించడానికి తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. గత ఏడాది సెప్టెంబరులో తుమ్మలగుంట చెరువులో ఏమి జరుగుతుందో వివరణ ఇవ్వాలని కలెక్టర్, తుడా, నీటిపారుదల శాఖను ఎన్జీటీ ఆదేశించింది. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ గతంలోనే సీరియస్ అయ్యింది. చెరువు స్టేటస్‌పై నివేదిక పంపాలని ఆదేశించింది. గత ఏడాది అక్టోబరులో తుడా నివేదికలు పంపినట్టు సమాచారం. అయితే వాటికి ఎన్జీటీ సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది.

పూర్వాపరాలిలా..

తిరుపతి రూరల్ మండలం సర్వేనెంబరు 60లో 82 ఎకరాల విస్తీర్ణంలో తుమ్మలగుంట చెరువు ఉంది. దీనికి ఎగువన ఉండే పేరూరు చెరువు, స్వర్ణముఖి నుంచి కాలువల ద్వారా తుమ్మలగుంట చెరువుకు నీళ్లు వచ్చేవి. ఈ నీటితో తుమ్మలగుంట 180 ఎకరాల ఆయకట్టుతో పొలాలు పచ్చగా, గ్రామం పుష్కలంగా ఉండేది. భూగర్భ జలాలు బాగా అందుబాటులో ఉండేవి. ఇదంతా గతం. క్రమేపీ ఈ చెరువుకు నీళ్లు తెచ్చే కాలువలు అంతర్ధానమయ్యాయి. చెరువు ఎండిపోయింది. తుమ్మలగుంట చెరువుకు రెండు నీటి సరఫరా కాలువలు ఉండేవి. స్వర్ణముఖి నుంచి పాత కాల్వ మీదుగా ఒకటి, పేరూరు చెరువు నుంచి అక్కగార్ల కళం కాలువ నుంచి మరో కాలువ తుమ్మలగుంటకు అనుసంధానమై ఉండేవి. చెరువులోకి నీళ్లొచ్చాయంటే రెండు కార్లు గట్టిగా పండించుకోవచ్చన్న ధీమా ఇక్కడ రైతులకుండేది. కాలక్రమంలో ఈ రెండు కాలువలు కబ్జాచేసి.. ఇళ్లు కట్టేశారు. దీంతో చెరువుకు నీరు చేరే అవకాశం లేకుండా పోయింది. ఆ చెరువు ఇప్పుడు కుర్రకారుకు సువిశాల ఆటస్థలంగా మారిపోయింది. 82 ఎకరాల చెరువులో 22 ఎకరాలను మునకపట్టాల కింద రైతులకు రెవెన్యూ అధికారులు అందించారు. తక్కిన 60 ఎకరాల్లో తుమ్మలగుంట స్థానికుడైన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గతంలో తుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు చెరువును సుందరీకరణ చేయాలని భావించారు. ఈక్రమంలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వేశారు. బోటింగ్ ఏర్పాటు చేయాలని చెరువును కొంత భాగం తవ్వారు. అంతేగాక జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు కొంత కేటాయించారు. నెట్ ప్రాక్టీసింగ్‌కు వినియోగిస్తున్నారు. ఏడాదికి ఒకసారి ఇక్కడ గ్రామీణ క్రికెట్ పోటీలు పెడుతుంటారు. ఈ నేపథ్యంలో చెరువు తన స్వరూపాన్ని కోల్పోయిందంటూ ఎన్జీటీకి ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో ఎన్జీటీ ఆగ్రహంపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారో వేచిచూడాలి.

గున్న ఏనుగు మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 18: చంద్రగిరి మండలం కూచువారిపల్లె అటవీప్రాంతంలోని నాగపట్ల వెస్ట్ బీట్ పరిధిలో ఓ గున్న ఏనుగు (ఏనుగు పిల్ల) మృతి చెందింది. నెల రోజులుగా చంద్రగిరి మండలంలోని మూలపల్లె, భీమవరం, చిన్న రామాపురం, శేషాపురం, బీ.కొంగరవారిపల్లె, యల్లంపల్లి ప్రాంతాల్లో ఏనుగులు అర్ధరాత్రయితే పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల యల్లంపల్లికి చెందిన రైతు మనోహర్‌రెడ్డి తన పొలం వద్ద నిద్రిస్తుండగా ఏనుగు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం అటవీ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా కూచువారిపల్లె అటవీ ప్రాంతంలో గున్న ఏనుగు మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీ ఉన్నతాధికారులు సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌వో సతీష్, శివకుమార్, ఎఫ్‌ఆర్వో దత్తాత్రేయ, డీఆర్వో చక్రపాణి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన గున్న ఏనుగును పరిశీలించారు.



గున్న ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

సుమారు ఏడాది వయసున్న ఈ ఏనుగు పిల్ల మృతి చెంది 20 రోజులకుపైగా అవుతున్నట్లు భావిస్తున్నారు. కళేబరం కూడా పురుగులు పట్టి, దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. అనంతరం ఎస్వీ జూపార్కు నుంచి వైద్యులను పిలిపించి పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక వచ్చాక ఎలా చనిపోయిందో తెలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

పద్మావతి మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్ల రూసా నిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 18: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీకి పీఎం ఉష (రూసా) నిధులు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. దీనిపై వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని హర్షం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న వర్సిటీ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పటికే అనేక గొప్ప ర్యాంకులను సాధించిందని గుర్తు చేశారు. యూజీసీ నాక్ ఏప్లస్ పొందడం వల్లే రూసా నిధులకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ నిధులతో వర్సిటీలో బోధన, పరిశోధనకు సంబంధించిన సదుపాయాలను మెరుగు పరుస్తామన్నారు.

ఆస్ట్రేలియా అమ్మాయి.. తిరుపతి అబ్బాయి

మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 18: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కి చెందిన బ్రైడి మార్టిన్.. తిరుపతికి చెందిన జీపాళ్యం నాగేంద్ర సాయిలు ఆదివారం రాత్రి మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ విభాగం డీన్ డాక్టర్ జీపాళ్యం సురేష్, శారద దంపతుల కుమారుడు నాగేంద్రసాయి తన మాస్టర్‌డిగ్రీని మెల్‌బోర్న్‌లోని డీకిన్ యూనివర్సిటీలో పూర్తిచేశారు. చదువు పూర్తయ్యాక ఉద్యోగంలో చేరిన సంస్థలో మెల్‌బోర్న్‌కి చెందిన జోఅన్నె మార్టిన్, డారెన్ మార్టిన్‌లకుమార్తె బ్రైడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మూడేళ్లపాటు ప్రేమలో ఉన్న వీరు.. ఇరుకుటుంబాల అంగీకారంతో ఆదివారం రాత్రి తిరుపతిలోని హోటల్‌తాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. ఈ నవదంపతులను వెటర్నరీవర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బంది ఆశీర్వదించారు.



శశి (ఫైల్ ఫొటో)

పరీక్షల్లో ఫెయిలవడం.. అమ్మ మందలింపు

● మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 18: పరీక్షల్లో ఫెయిలవడంతో అమ్మ మందలించిందని.. మనస్తాపంతో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన టి.గోవిందరాజులు, మమత దంపతుల రెండో కుమార్తె టి.శశి(16). ఈమె తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల హాస్టల్లో ఉంటూ, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసి సెలవుల్లో ఇంటికి వెళ్లింది. వారం కిందట వచ్చిన ఫలితాల్లో ఆమె ఫెయిలవడంతో తల్లి మందలించింది. మూడ్రోజుల కిందట హాస్టల్‌కు వచ్చిన ఆమె.. శనివారం రాత్రి ఇంటికి ఫోన్‌చేసి చాలాసేపు మాట్లాడింది. రాత్రి 12 గంటల వరకు చదువుకుని, సహ విద్యార్థినులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఆదివారం సెలవు కావడంతో అందరూ ఉదయం ఎనిమిది గంటలకు నిద్రలేచారు. అప్పటికే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న శశి కనిపించింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. తల్లి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. 'ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివాను.ఒక్కసారిగా ఇంగ్లిష్‌లో చదవాల్సి రావడం కష్టంగా ఉంది. అర్థం చేసుకోలేకపోతున్నాను. అందుకే పరీక్షల్లో కూడా ఫెయిల్ అయ్యాను. అమ్మ ఎప్పుడూ తిడుతూనే ఉంటారు. నావల్లనే కదా మీ అందరికీ అవమానం. నేనే వెళ్లిపోతా. మీరు సంతోషంగా ఉండండి' అంటూ ఆమె రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది.

అత్త చీరతో..: ఉరేసుకోవడానికి వాడిన చీర శశి అత్తదని పోలీసులు గుర్తించారు. ఊరినుంచి వచ్చేటప్పుడే ఈ చీరను తెచ్చుకున్నట్లు భావిస్తున్నారు. కాగా, కొన్నేళ్ల కిందట ఇద్దరు కుమార్తెలతో పుట్టింటికి చేరిన మమత.. ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. రెండో కుమార్తె శశి ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెతో పాటు బంధువులు రోదిస్తున్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



- బడి సుధాయాదవ్

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి జర్నలిస్టుపై దాడి చేయడం హేయమైన చర్య. ఇటీవల రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆయన అన్నారు. జర్నలిస్టులపై దాడులు ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 18 : రాప్తాడు వైసీపీ సిద్ధం సభకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అమానుషమని టీడీపీ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి దేశిరెడ్డి రఘునాథ, మహేష్ నాయుడు ఒక ప్రకటనలో ఖండించారు.సీఎం జగన్ సమక్షంలోనే మీడియాపై దాడి చేయడం రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనేందుకు నిదర్శనమన్నారు. ఎన్నికలు దగ్గర పడతున్నకొద్దీ వైసీపీ ఆగడాలు శ్రుతి మించనున్నాయని వారు పేర్కొన్నారు.

ఇది పోలీసుల వైఫల్యమే: సీపీఐ

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన మూకలను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమేనని పేర్కొన్నారు. పోలీసులకి దమ్ము, ధైర్యం ఉంటే దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు.

అ'పూర్వ' కలయిక



భాకరాపేట, ఫిబ్రవరి 18: భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం పాఠశాలలో జరిగింది. వివిధ ప్రదేశాలలో వివిధ వృత్తులలో స్థిరపడిన వారందరూ ఒకచోట చేరి ఆనందంగా తమ కుటుంబాలు, పిల్లలు, వృత్తి జీవిత విశేషాలను పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, సుహాసిని, షర్మిల, మునాఫ్, హరిబాబు, ఈశ్వర్ రెడ్డి, ఎర్రమరావు, విశ్వనాథరెడ్డిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

65 మందికి కంటి పరీక్షలు



పాకాల, ఫిబ్రవరి 18: పాకాల ప్లాటినమ్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రి వైద్య బృందం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో 65 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. శంకర్ నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు జయరామనాయుడు, కుప్పుస్వామినాయుడు, అనిల్ కుమార్, జి.దొరపార్థు, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేక పూజలు



పాకాల, ఫిబ్రవరి 18: దామలచెరువులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ద్వాదశ వర్ష మహా కుంభాభిషేక పూజలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ, నిత్యహోమాలు, గోపుర మహాకుంభాభిషేకం, అమ్మవారికి కుంబాభిషేకం, అభిషేకం, పుష్పాలంకారం, కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి వాసవీ కన్యకా పరమేశ్వరికి పుష్పపల్లకి సేవ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పాకాల, ఫిబ్రవరి 18: గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎన్.మధుబాల కోరారు. దామలచెరువు గ్రంథాలయాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, యువత వినియోగించుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జి మురళీబాబు, సిబ్బంది చంద్రశేఖర్ నాయుడు, పాఠకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న మధుబాల

బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



పొలకల సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న దృశ్యం

పాకాల, ఫిబ్రవరి 18: ఏపీ బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా పొలకల సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఆదివారం కె.ఒడ్డెపల్లిలో జరిగిన గౌరవసభ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కార్యవర్గాన్ని ప్రకటించారు. అలాగే మండల యువత అధ్యక్షుడిగా పొలకల గంగులయ్య, ప్రధాన కార్యదర్శులుగా సోంపల్లి సురేష్, దేరంగుల సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా నక్కల సురేంద్ర నియమితులయ్యారు. ముఖ్య అతిథులుగా స్టేట్ డైరెక్టర్ రఘుపతి, జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచార్య, చంద్రగిరి అధ్యక్షుడు జగదీశ్వర్, రాయలసీమ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వాసులు, పొలకల రమణ, మునిరాజు, మురళి, రామమూర్తి, పురుషోత్తం, మునస్వామి, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మెరుగైన వైద్య సేవలు

భాకరాపేట, ఫిబ్రవరి 18: పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని డాక్టరు పులివర్తి త్రిష్యారెడ్డి అన్నారు. భాకరాపేటలో ఆదివారం చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు సుమారు 500 మంది పిల్లలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పులివర్తి వినీల్, టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లం కొండ మురళి, కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, మోహన్ రెడ్డి, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి రెడ్డి, మల్లికార్జున రెడ్డి, విజయ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలపై ఏనుగుల దాడులు

పాకాల, ఫిబ్రవరి18: మండలంలో పంటపొలాలపై ఏనుగుల దాడులు కొనసాగు తున్నాయి. శనివారం, ఆదివారం దామలచెరువు పంచాయతీ మొరవపల్లె, కాకర్లవారిపల్లె పరిసరాలలో మామిడితోటలను ధ్వంసంచేశాయి. గుండ్లగుట్టపల్లె, ఎర్రేపల్లె పరిసరాలలో పంటలపై దాడిచేసి రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి. మూడు నెలలుగా రైతులకు కంటిమీద కునుకులేకుండా ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని ఏనుగుల బెడద తప్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పీవీపురంలో అట్టహాసంగా జల్లికట్టు



రామచంద్రాపురం, ఫిబ్రవరి 18: మండలంలోని పీవీపురం గ్రామంలో ఆదివారం జల్లికట్టు అట్టహాసంగా జరిగింది. గ్రామస్తులు వారం నుంచి తమ కోడిగిత్తలను జల్లికట్టుకు సిద్ధం చేశారు. కోడిగిత్తల కొమ్ములకు రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలతో పాటు విలువైన బహుమతులు కట్టారు. ఎద్దుల వెనుక డప్పు కొట్టి తరమడంతో అవి వీధుల్లో పరుగులు తీశాయి. యువకులు కోడిగిత్తలను నిలువరించే క్రమంలో కొందరు స్వల్పంగాగాయపడ్డారు. మండలంలో చివరి జల్లికట్టు కావడంతో వెదురుకుప్పం, వడమాలపేట, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల నుంచి భారీగా యువకులు, ప్రజలు తరలిరావడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. వచ్చిన వారికి గ్రామస్తులు భోజన వసతి ఏర్పాటు చేశారు.

పీవీపురం వీధుల్లో పరిగెడుతున్న గిత్తలను నిలువరిస్తున్న యువకులు



పరిపాలనా దక్షుడు చంద్రబాబు

సినీ నటుడు సుమన్



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: 'నాకు రాజకీయ గురువు, రాజకీయ ఓనమాలు నేర్పింది మాజీ సీఎం చంద్రబాబు. మంచి పరిపాలన దక్షత కలిగిన వ్యక్తి' అని ప్రముఖ సినీ నటుడు సుమన్ ప్రశంసించారు. ఆదివారం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఐదునెలల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు గుంటూరు జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, తాను తెలంగాణ వ్యక్తిని కాబట్టి వద్దని చెప్పానన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని అభ్యర్థించారు. రాజమండ్రి ఎంపీగా పోటీ చేయాలని వైసీపీ కూడా అవకాశం ఇచ్చినా, తెలంగాణలో ఉండటం వల్ల నిరాకరించానన్నారు. ప్రతిపక్షాలు క్యాలిక్యులేషన్, అండర్‌స్టాండింగ్, సీట్‌షేరింగ్, క్యాస్ట్ మేటర్ కరెక్టుగా లేకుంటే మళ్లీ వైసీపీనే అధికారంలోకి రావడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రజలు మెచ్చే మేనిఫెస్టోలు ప్రకటించిన పార్టీకే మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు. తమిళనటుడు విజయ్ రాజకీయ పార్టీ పెట్టడాన్ని ఆహ్వానిస్తున్నానని చెప్పుకొచ్చారు. అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చారిత్రాత్మకమని, ప్రధాని మోదీ దర్శనం చేసుకున్న తర్వాత తనకే శ్రీరాముని దర్శన భాగ్యం దక్కడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఇక దేశంలో మహిళలకు రక్షణ లేదని చెప్పారు. విదేశాల తరహాలో మహిళలకు రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అయితే అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు.

42 మంది ఎస్ఐలకు స్థాన చలనం

● 9 మందిని బదిలీ చేసిన డీఐజీ అమ్మిరెడ్డి ● వీఆర్‌లో ఉన్న 33 మందికి పోస్టింగులిచ్చిన ఎస్పీ మలిక గర్గ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 18 : జిల్లాలో 42 మంది ఎస్ఐలకు స్థానచలనం కలిగింది. వీరిలో 9 మంది ఎస్ఐలను వివిధ ప్రదేశాలకు బదిలీ చేస్తూ అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. అలాగే తిరుపతి వీఆర్‌లో ఉన్న 33 మంది ఎస్ఐలకు పోస్టింగులిస్తూ ఎస్పీ మలిక గర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. దిశ పోలీస్ స్టేషన్ నుంచి అటాచ్‌మెంట్‌పై సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న డి. లావణ్యను తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎం.అరుణ(తిరుపతి ఎస్‌బీ) శ్రీకాళహస్తి ఒన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. ఐ.హిమబిందు (చంద్రగిరి) తిరుపతి ఎస్‌బీకి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి 2టౌన్ నుంచి అటాచ్‌మెంట్‌పై సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఆర్. విజయకుమార్ నాయక్ భాకరాపేట ఎస్ఐగా నియమితులయ్యారు. ఒ.రామస్వామి (సీసీఎస్ తిరుపతి) అలిపిరి స్టేషన్‌కు, శ్రీకాళహస్తి ఒన్‌టౌన్ నుంచి అటాచ్‌మెంట్‌పై తిరుచానూరు స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న టి.వెంకట సుబ్బయ్య తిరుచానూరు స్టేషన్‌కు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించారు. టి.సాయినాథ్ చౌదరి (తిరుమల 2టౌన్) తిరుపతి సీసీఎస్‌కు, ఎ.హరిప్రసాద్ (శ్రీసిటీ) తిరుపతి ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌కు, ఎ.చిరంజీవి (తిరుచానూరు) ఆర్సీ పురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక తిరుపతి వీఆర్‌లో 33మంది ఎస్‌లను ఎస్పీ వివిధ స్థానాల్లో నియమించారు. కె.శ్రీకాంత్ శ్రీసిటీ ఎస్ఐగా నియమితులయ్యారు. ఎ.విజయభాస్కర్‌రాజు (శ్రీకాళహస్తి 2టౌన్), ఎ.జావీద్ బాషా 9రేణిగుంట), జి.శ్రీనాథ్ ప్రసాద్ (తిరుపతి వెస్ట్), కె.జయరామ్ నాయక్ (తిరుపతి ట్రాఫిక్), బి.వెంకటరమణ (ఏర్పేడు), పి.విజయభాస్కర్ నాయుడు (శ్రీకాళహస్తి రూరల్), టి.శివప్రసాద్ (శ్రీకాళహస్తి 2టౌన్), పి.మురహరి బాబు (తిరుపతి ఈస్ట్), జి.శ్రీరామప్రసాద్ (తిరుపతి ట్రాఫిక్), కె.నాగమాణిక్యం (పీసీఆర్, తిరుపతి), డి.బలరాజు (తిరుపతి వెస్ట్), ఎ.నాగరాజు (తిరుపతి సీసీఎస), ఎ.అల్లాబక్ష్ (శ్రీకాళహస్తి రూరల్), డి.చంద్రశేఖర్ (సీసీస్ తిరుపతి), ఎస్.ఇషాక్ బాషా (పాకాల), సి.బాబు (శ్రీకాళహస్తి 1టౌన్), డి.లక్ష్మీనారాయణ (ఎస్‌బీ తిరుపతి), ఎన్.జయరామప్ప (ఎస్వీయూ తిరుపతి), కేఎల్ కళావతి (డీసీఆర్బీ తిరుపతి), ఎస్.అబ్దుల్ కలామ్ ఆజాద్ (తిరుపతి ట్రాఫిక్), కె.రెడ్డప్ప (తిరుపతి ట్రాఫిక్), పి.వెంకటరమణ (తిరుమల సీసీఎస్), కె.ఆంజనేయ ప్రసాద్ (పీసీఆర్ తిరుపతి), కె.శివశంకర్ (ఎయిర్‌పోర్ట్), బి.తులసన్న (తిరుపతి వెస్ట్), జి.బాలరాజు (తిరుపతి ఎస్‌బీ), కె.శ్రీరాములు (తిరుమల ట్రాఫిక్), జి.వెంకటరమణ (తిరుపతి ఎస్‌బీ), ఎస్.ఎ.రఫీక్ (పీఆర్ తిరుపతి), పి.శ్రీనివాసులు (సత్యవేడు), ఎ.దాదాపీర్ (తిరుపతి ఎస్‌బీ) బాధ్యతలు చేపట్టనున్నారు.

మాయా'జలం' హంద్రీ-నీవా.. ఎన్నికల గట్టెక్కనీవా!

● వాపోతున్న వైసీపీ శ్రేణులు ● కనీసం లైనింగ్ పూర్తి చేయని కాలువ ● లిఫ్టులతో ఎత్తిపోసినా ఎండిపోతున్న జలం
● 26న జగన్ పర్యటన? ● నిండిన కాలువ చూపడానికి అధికారుల పాట్లు



వర్తికుప్పం వద్ద ఎండిపోయిన కాలువ

కుప్పం, ఫిబ్రవరి 18: హంద్రీ-నీవా కాలువ వైసీపీకి ప్రాణావసరంలా మారిపోయింది. ప్రస్తుతం కుప్పం రాజకీయం ఈ కాలువ చుట్టూనే తిరుగుతోంది. అదిగో నీళ్లు వచ్చేశాయని అధికార పార్టీ.. ఏదీ ఎక్కడ? అంటూ ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా వేదికగా వాదోపవాదాలకు దిగుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితో లేని జలాలతో కాలువను నింపడానికి మరోవైపు అధికారులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈనెల 26వ తేదీన సీఎం జగన్ కుప్పం పర్యటన దాదాపు ఖరారైందని చెబుతున్న నేపథ్యంలో వారి మెడల మీద కత్తి వేలాడుతోంది. సారు వచ్చే సమయానికి నీళ్లతో కాలువ మొత్తం కళకళలాడాలన్న ఆదేశాలతో ఊపిరి తిప్పుకోలేక పోతోంది అధికార యంత్రాంగం.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సొంత నియోజకవర్గమైన కుప్పం తాగు, సాగునీటి అవసరాలు తీర్చడానికి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువ కుప్పం బ్రాంచి కెనాల్ పనులను తలకెత్తుకున్నారు. కృష్ణా జలాలను కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మధ్యలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని పలు చెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపాలన్న బృహత్ప్రణాళిక తయారు చేసుకుని, కాలువ నిర్మాణంకోసం రూ.468 కోట్లు విడుదల చేశారు. పనులు శరవేగంగా సాగాయి. ఎన్నికలు సమీపించే నాటికి సుమారు 75-80 శాతం పనులు పూర్తి చేసి, వి.కోట వరకు హంద్రీ-నీవా జలాలను తీసుకొచ్చారు.

ప్రభుత్వం మారడంతో కదలని ప్రాజెక్టు

2019లో టీడీపీ అధికారం కోల్పోయి వైసీపీ గద్దెనెక్కడంతో హంద్రీ-నీవా కాలువ పనులు సుప్తావస్థలోకి జారిపోయాయి. నాలుగున్నరేళ్ల పాలనలో ఈ కాలువ గురించి సీఎం జగన్ పట్టించుకున్న పాపాన పోలేదు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో ఒక్కటంటే ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. నిధుల విడుదల జరగనేలేదు. ప్రభుత్వ వ్యతిరేకత క్రమేణా పెరుగుతుండడంతో జగన్‌కు ఏదో ఒక ఎన్నికల పథకం అవసరమైంది. గట్టి అభివృద్ధి ఒక్కటైనా చేసి చూపించాలన్న, కనీసం అలా మాయాజాలం చేయాలని లేదంటే కుప్పంలో కనీస పోటీనివ్వడం కష్టమన్న వాస్తవం తెలిసి వచ్చింది. 'వైనాట్ 175' అని కుప్పం కూడా నాదేనని వేదికలెక్కి మాట్లాడినంత ఈజీగా ఇక్కడ పరిస్థితి లేదన్న వాస్తవం స్పష్టమైంది.

మాయాజాలం బట్టబయలు

సీఎం పర్యటన నేపథ్యంలో హంద్రీ-నీవా కాలువ పూర్తి అయిపోయి నీళ్లు పుష్కలంగా తరలి వచ్చేస్తున్నట్లు కలరింగ్ ఇవ్వడానికి సుమారు పక్షం రోజులుగా స్థానిక వైసీపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఎదురు తిరుగుతున్నాయి. కాలువలో నీళ్లు లేవు కాబట్టే సీఎం పర్యటన మూడుసార్లు వాయిదా పడిందన్నది బహిరంగ రహస్యం. ఈ వాస్తవం ఒప్పుకోవడానికి అధికార పార్టీలో ఎవరూ సిద్ధంగా లేరు. ఎలాగైనా హంద్రీ-నీవా కాలువలో నీటిని చూపించాలన్న తాపత్రయంతో సీఎం వచ్చేస్తున్నారన్న ప్రతిసారీ హంద్రీ-నీవా కాలువలోకి నీళ్లు వదిలే ప్రయత్నాలు జరిగాయి. చివరిసారిగా సుమారు వారం రోజుల క్రితం కాలువలో నీళ్లు కనిపించాయి. అయితే ఇలా చేసిన ప్రతిసారీ నీళ్లు వదిలిన సుమారు మూడునాలుగు రోజులకే కాలువ పూర్తిగా ఎండిపోయింది. ఇప్పుడు కూడా అక్కడక్కడా గుంతల్లో అరడుగు మడుగులు తప్ప కాలువ అంతా ఖాళీగా ఎండిపోయే ఉంది. దీంతో హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేయకనే ప్రజలను మాయచేయడానికి అధికార పార్టీ ప్రయత్నిస్తున్నదన్న వాస్తవం ప్రజలకు తెలిసి వచ్చింది. కృష్ణానదిలోనే జలాలు లేనప్పుడు తాము మాత్రం కాలువలోకి నీళ్లు ఎలా తేగలమంటూ హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు వాపోతున్నారు. పుంగనూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్‌కు నీటిని ట్యాంకర్ల ద్వారా తరలించి, అక్కడినుంచి రామకుప్పం మండలం వర్తికుప్పం చేరేలా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నట్లు వినిపిస్తోంది. అయితే హంద్రీ-నీవా కాలువలోకి అప్పుడప్పుడైనా సరే నీళ్లు ఎలా వస్తున్నాయన్న రహస్యాన్ని అధికారికంగా వెల్లడించడానికి ఎవరూ ఇష్టపడడంలేదు.

అందుకే తొందర

మార్చి నెల వచ్చిందంటే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది. అప్పుడిక అభివృద్ధి పేరుతో ఈ ప్రారంభ కార్యక్రమాలు చేసే అవకాశం ఉండదు. ఆలోగానే కుప్పం ప్రజలకు హంద్రీ-నీవా జలాలను తెచ్చిన అపర భగీరథుడిగా తమ నాయకుడిని చూపడానికి వైసీపీ నాయకులు తంటాలు పడుతున్నారు. మరోవైపు సీఎం పేషీ కూడా ఇదే కారణంతో జలాలను ఎలాగైనా నింపాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన సీఎం పర్యటన ఈసారి ఈనెల 26వ తేదీన దాదాపు ఖరారైంది. సభ జరిగేది మఠం వద్దనే అయినా, ఆ సమీపంలోని గుండిశెట్టిపల్లెకు ఎత్తిపోసే జలాలు రాలేవు కాబట్టి, దానికి ముందుగా ఉన్న రామకుప్పం మండలం వర్తికుప్పం వద్దనే హంద్రీ-నీవా కాలువను సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. తిమ్మిని బమ్మిని చేసైనా సరే, కాలువలో నీటిని పారించి, వారి మాటలు నిజం చేయాల్సిన అక్కర ఇప్పుడు అధికార యంత్రాంగంపై పడింది.

చంద్రబాబు చేసిన పనులే

జగన్‌కు వాస్తవం తేటపడడంతో హంద్రీ-నీవా కాలువ పనులు హఠాత్తుగా గుర్తుకొచ్చాయి. అంతే.. కొన్ని నెలలనుంచీ అరాకొర నిధులు విడుదల చేసి, చేసీచేయనట్లుగా పనులు చేస్తున్నట్లు కలరింగ్ ఇస్తూ వచ్చారు. అయితే నియోజకవర్గ పరిధిలో కాలువ సాగినంత మేరా పరిస్థితిని పరిశీలిస్తే జరిగిన పనులు ఎటువంటివో తెలిసి వస్తుంది. ● శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద చంద్రబాబు హయాంలో కాలువకు చేసిన లైనింగ్ పనులు తప్ప మళ్లీ ఏరకమైన పనులు జరిగిన సూచనలు కనిపించలేదు. ● రామకుప్పం మండలం వర్తికుప్పం తదితర ప్రాంతాల్లో కాలువ రెండువైపులా చెట్టుపుట్టలు పెరిగిపోయాయి. వాస్తవాలు ఇలా ఉంటే.. హంద్రీ-నీవా కాలువ పూర్తిగా నిర్మించేశామని స్థానిక వైసీపీ నేతలు ఊదరగొట్టసాగారు. ఈ ప్రచార హోరులోనే సీఎం జగన్ కుప్పం పర్యటనకు వస్తున్నట్లు ప్రచారాలు మొదలయ్యాయి. ఈనెల 5, 12, 16 తేదీలు మారి చివరకు 26వ తేదీన సీఎం పర్యటన ఖరారైనట్లు అధికార పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. సీఎం సభకోసం శాంతిపురం మండలం మఠం వద్ద సభాస్థలిని కూడా సిద్ధం చేస్తున్నారు.




చంద్రబాబు హయాంలో గుండిశెట్టిపల్లె వద్ద కాలువకు లైనింగ్ పనులు



వైసీపీ అధికారంలోకి వచ్చాక కనీసం లైనింగ్ పనులు చేయని కాలువ

● వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్‌తో మొదలై రామకుప్పం మండలం వర్తికుప్పంనుంచి సాగుతూ వచ్చే కాలువ ఇక్కడ అంతమై పైపులైన్ల ద్వారా గ్రావిటీ మీద, మళ్లీ కాలువ రూపంలో సిద్దావూరు తదితర గ్రామాల మీదుగా గుడుపల్లె, అనంతరం కుప్పం మండలంలోని గమ్యస్థానమైన పరమసముద్రం చెరువుకు చేరుతుంది. నియోజకవర్గ పరిధిలో కాలువ పొడవు 139 కిలోమీటర్లు. ఎక్కడైనా సరే, చంద్రబాబు హయాంలో చేసిన లైనింగ్ పనులు తప్ప మళ్లీ అటువంటి పనులు జరగలేదు.

ఎన్నికల్లో నియంత్రించాలనే టీడీపీ నేతలపై రౌడీషీట్లు



● ఎత్తివేయాలంటూ డీజీపీకి చంద్రబాబు లేఖ

కుప్పం, ఫిబ్రవరి 18: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ నేతలపై పెట్టిన తప్పుడు కేసుల ఆధారంగా దురుద్దేశంతో పోలీసులు తెరుస్తున్న రౌడీషీట్లను ఎత్తేయాలని కోరుతూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు డీజీపీకి లేఖ రాశారు. ఎన్నికల్లో చురుకైన నాయకులు, కార్యకర్తల కదలికలను నియంత్రించాలనే నేరపూరిత కుట్ర ఇందులో దాగున్నదని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 17వ తేదీన రాష్ట్ర డీజీపీకి రాసిన లేఖ సారాంశం ఇదీ.. 'నేను 1989 నుంచి కుప్పం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా. శాంతియుత, ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు చేపడుతున్న తెలుగుదేశం నేతలపై పోలీసులు తప్పుడు, పనికిమాలిన కేసులు పెట్టి వేధిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి తప్పుడు కేసుల ఆధారంగా పోలీసులు, టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరుస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నేతల కదలికలను పరిమితం చేయాలనే నేరపూరిత కుట్రతో ఇది జరుగుతోంది. దురదృష్టవశాత్తు అధికార వైసీపీ నేతలతో చురుగ్గా సహకరిస్తున్న ఒక వర్గం పోలీసు అధికారులు ఈ కుట్రకు పాల్పడుతున్నారు. వైసీపీ వైసీపీ నేతల ఆదేశాల మేరకు చురుగ్గా ఉన్న టీడీపీ నేతలను పోలీసులు టార్గెట్ చేసుకున్నారు. కుప్పం మున్సిపాలిటీలో ఎస్.రాజ్ కుమార్, కన్నన్, అప్పు అలియాస్ ముఖేశ్, సుజిత్, దిలీప్, రామకుప్పం మండలంలో బి.గజేంద్ర, బి.మనోహర్, సాయి, జైశంకర్, శంకరాచలం, రాజమణి తదితరులను పోలీసులు రౌడీషీట్లు తెరిచే రూపంలో వేధిస్తున్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి ముప్పులాంటి ఇలాంటి ఘటనలను అడ్డుకోవాలి. టీడీపీ నేతలపై పదుల సంఖ్యలో పెట్టిన తప్పుడు కేసులతోపాటు రౌడీషీట్లను బేషరతుగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నా. అలా చేయడంవల్ల ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులను పరిరక్షించవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

తిరుచ్చిపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, ఫిబ్రవరి 18: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి మార్చి 8వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది.

అంతర జిల్లా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా శివ



మొదటి బహుమతి సాధించిన శివ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 18: అంతర జిల్లా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌గా శివ నిలిచారు. అంతర జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలు తిరుపతిలోని యూత్ హాస్టల్లో ఆదివారం రాత్రి నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు శివను ఛాంపియన్‌గా ప్రకటించారు. విజేతలకు తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్ ప్రకాష్, శివప్రసాద్, ప్రవీణ్, టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, హాకీ క్రీడాకారుడు పూకా విజయకుమార్, బహుమతులను అందజేసి అభినందించారు. 55 కేజీల్లో షేక్ ఫజిల్, 60 కేజీల్లో శివ, 65 కేజీల్లో గౌస్‌భాష, 75 కేజీల్లో అనిల్ కుమార్, 80 కేజీల్లో సతీష్, 85 కేజీల్లో తేజ, 90 కేజీల్లో అహ్మద్ విజేతలుగా నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా శివప్రసాద్, భాస్కరన్, శ్రీరాములు, అరుణ్, హరి, భద్రి, రాజు, ఫయాజ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది బాడీ బిల్డర్లు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం



తిరుచానూరు, ఫిబ్రవరి 18: తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీకృష్ణ స్వామి ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చిపై కొలువుదీరి తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉత్సవర్లకు అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి తిరువీధి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మధు, ప్రసాద్, గణేష్, భాస్కరనాయుడు పాల్గొన్నారు.

24న కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో ఈ నెల 24వ తేదీన కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన భక్తులు తీర్థ స్నానమాచరించి, దానధర్మాలు చేసి స్వామిని దర్శించుకుంటారు. ప్రకృతి సౌందర్యాల నడుమ కుమారధార తీర్థంలో స్నానమాచరించడాన్ని భక్తులు ప్రత్యేకంగా భావిస్తారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టింది. అదే రోజున ఆలయ నాలుగు మాడవీధుల్లో రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సర్వాలంకార భూషితుడై శ్రీవారు తనకు ఇష్టమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

విశ్వనాథ రెడ్డికి కళానిధి అవార్డు



అవార్డు అందుకుంటున్న విశ్వనాథరెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కలంకారీ కళాకారుడు విశ్వనాథరెడ్డి కళానిధి అవార్డు అందుకున్నారు. హర్యానాలో ఆదివారం సూరజ్ కుండ్ అంతర్జాతీయ హస్తకళ మేళ జరిగింది. ఇందులో భాగంగా కలంకారి విభాగంలో విశ్వనాథరెడ్డి ప్రదర్శనకు గుర్తింపు లభించింది. ఈ మేరకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా విశ్వనాథరెడ్డి ఈ పురస్కారం అందుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 71,021 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,965 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



సుధీర్ తీర్థ స్వామిజీ, రమణ తీర్థ స్వామిజీ - ఆషిక రంగనాథ్ - వెంకట నర్సింగరావు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఉడిపికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు సుధీర్‌తీర్థ, రమణతీర్థ, తెలంగాణ ఎమ్మెల్యే వెంకట నర్సింగరావు, సినీ హీరోయిన్ ఆషిక రంగనాథ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంకట నర్సింగరావు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజలకు మంచి పరిపాలన అందించాలని ప్రార్థించానన్నారు.

వ్యవసాయ కళాశాల కార్మికుల వినూత్న నిరసన



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 18 : ఎస్వీ వ్యవసాయ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మూడవ రోజు ఆదివారమూ కొనసాగింది. ఇందులో భాగంగా కార్మికులు మోకాళ్లపై నిల్చుని.. చెవిలో పూలు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, టైం స్కేల్, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ప్రభుత్వ ప్రసూతి సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వార్డెన్ భారతిని సస్పెండ్ చేయాలి : ఏఐఎస్ఎఫ్



హాస్టల్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 18 : ఎస్వీ వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రియదర్శిని బాలికల హాస్టల్ వార్డెన్ భారతిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి డిమాండ్ చేశారు. హాస్టల్లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శశి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ముందురోజు రాత్రి ఉరేసుకున్న విద్యార్థి మృతదేహాన్ని ఆదివారం ఉదయం 10 గంటల వరకు అలాగే ఉంచడం దారుణమని, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. వసతిగృహంలోని సీసీ కెమెరాలను బయటపెట్టకుండా పనిచేయలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, నవీన్, ప్రవీణ్, హరికృష్ణ, చంద్రానాయక్, సురేష్, తేజ పాల్గొన్నారు.

తిరుపతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కరుణాకరరెడ్డి, శిరీష

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర 894వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకుం దామని టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మేయర్ డాక్టర్ శిరీషతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24న ఉదయం 9 గంటలకు గోవిందుడి ఆలయ ముఖద్వారం నుంచి, చతుర్మాడ వీధుల్లో ఆధ్యాత్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1130 ఫిబ్రవరి 24న జగద్గురు రామానుజాచార్యుల అమృత హస్తాలతో తిరుపతిలో ప్రారంభమైన అగ్రహారం గోవిందరాజపురంగా, రామానుజపురంగా అంచెలంచెలుగా ఎదుగుతూ తిరుపతి నగరిగా భాసిల్లుతోందన్నారు. గడిచిన రెండేళ్ల ఈ పండుగను ఘనంగా నిర్వహించామని, ఈసారి టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో వైభవంగా జరుపనున్నామని వివరించారు. ఈ వేడుకలను టీటీడీ అధికారికంగా నిర్వహించేలా పాలకమండలి సమావేశంలో నిర్ణయం చేయబోతున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటెంజెంట్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటెంజెంట్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్.డి.రవి డిమాండ్ చేశారు. ఆదివారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్స్ సమస్యలతో సతమతవుతున్నారని తెలిపారు. చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్నట్లు వాపోయారు. కనీస వేతనంగా కంటింజెంట్స్‌కు రూ.16వేలు, స్వీపర్లకు రూ.12వేలు, ఆయాలకు రూ.10వేలు చెల్లించాలన్నారు. లేకపోతే ఉద్యమించాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు కె.వై.రాజా, చంద్రకళ, సరోజమ్మ, జ్యోతి, భాగ్యమ్మ, వెంకటరమణమ్మ, జీవమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

మైదానంలో నిర్మాణాలపై కోర్టును ఆశ్రయిస్తాం



తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 18 : ఎస్వీ హైస్కూల్ మైదానంలో నిర్మాణాలపై కోర్టును ఆశ్రయించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉదయం సంఘం సమావేశం నిర్వహించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ మైదానం చరిత్ర కలిగిన ప్రదేశమని, ఎంతోమంది పేద విద్యార్థులు ఈ మైదానంలో ఆడుకుంటూనే ఉన్నతస్థాయికి చేరారని గుర్తు చేశారు. దాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తోట లక్ష్మీనారాయణ, కడప రమేష్, ఖాసీం, దేవరాజులు, శ్రీనివాసులు, చిరంజీవి, ప్రతాప్, అంబేడ్కర్ భవన్ కోశాధికారి మురళి, రెడ్డెప్ప, చంద్ర, రామారావు తదితరులు పాల్గొన్నారు.



పీఎస్ మాల్‌కు ఘనంగా భూమిపూజ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: ఎమ్మార్‌పల్లిలో పంగులూరి సీతమ్మ వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఉప మేయర్ భూమన అభినయ్ పాల్గొన్నారు. తమ సహాయ సహకారాలు అందిస్తామని, ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తొలివిడతగా ఐదు అంతస్తులతో విశాలమైన భవన సముదాయం నిర్మిస్తున్నారు. సీతమ్మ భూముల అభివృద్ధికి ఆర్యవైశ్యులు ముందుకు రావాలని, వీలునామాలో ఉన్న విధంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి కొండూరి మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బా చంద్రశేఖర్, ముక్రంశెట్టి రాములు, ముప్పల నరసింహులు, శిరీష, కామిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు శ్రీలీల



తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ శ్రీలీల శ్రీవారి దర్శనార్థం ఆదివారం కాలినడకన తిరుమలకు వచ్చారు. రాత్రి 7 గంటలకు అలిపిరిలో కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి తిరుమలకు చేరుకున్నారు. జీఎంఆర్ అతిథిగృహంలో బస చేశారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.





బస్సులు లేక.. గమ్యం చేరలేక



సీబీఎస్‌లో ప్రయాణికులకు తప్పని కష్టాలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18 : బస్సుల కొరతతో తిరుపతి సెంట్రల్ బస్టేషన్‌లో ప్రయాణికులకు వరుసగా రెండో రోజూ అవస్థలు తప్పలేదు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో గమ్యం చేరేది ఎట్లా దేవుడా అంటూ తలలు పట్టుకుని కూర్చున్నారు. అనంతపురం జిల్లాలో నిర్వహిస్తున్న వైసీపీ సిద్ధం సభకు జిల్లావ్యాప్తంగా 11 డిపోల నుంచి 374 బస్సులను శనివారం ఉదయమే మళ్లించారు. అందులో తిరుపతి, తిరుమల, మంగళం, అలిపిరి డిపోల నుంచి 171 ఉన్నాయి. బస్సులు తగిన సంఖ్యలో లేకపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చంటిపిల్లలు, వృద్ధులతో అవస్థలు పడాల్సి వచ్చింది. పార్టీ కార్యక్రమాలకు బస్సులను తరలించడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రయోజనాలను పక్కనబెట్టి సొంత ప్రయోజనాలకు బస్సులను వాడుకోవడం ఏమిటని నిలదీస్తున్నారు. మరోవైపు ప్రైవేటు వాహనదారులు ఈ అవకాశాన్ని బాగా వాడుకున్నారు. అధిక చార్జీలు వసూలు చేసి, అందినకాడికి దోచుకున్నారు. కాగా, సోమవారం ఉదయం నుంచి అన్ని బస్సులు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొన్నారు.



ఆర్టీసీ యంత్రాంగం ఇలా చేయడం సరికాదు

మేము శుభకార్యానికి హాజరయ్యేందుకు మదనపల్లెకు వెళ్లాలని వచ్చాం. గంట నుంచి వేచి ఉన్నా ఒక్క బస్సు రాలేదు. బస్సులు లేవని చెప్పేవారు కూడా లేరు. సమయానికి గమ్యస్థానానికి చేరుతామో లేదో తెలియడం లేదు. ప్రయాణం రద్దు చేసుకోవాలనిపిస్తోంది. ఆర్టీసీ యంత్రాంగం ఈ విధంగా చేయడం సరికాదు.

\- శ్రీనివాస్, మదనపల్లె

సమాచారం చెప్పేవారు కూడా లేరు

తమిళనాడు షోలింగర్ సమీపంలో ఆలయ కుంభాభిషేకం ఉంది. ఆ ఉత్సవానికి వెళ్లేందుకు బస్టాండుకు వచ్చా. పళ్లిపట్టుకు వెళ్లేందుకు గంట నుంచి వేచి ఉన్నా బస్సులు రాలేదు. వస్తుందో రాదో తెలియడం లేదు. ఆ సమాచారం చెప్పేవారు కూడా లేరు. ఆర్టీసీ యాజమాన్యం బస్సుల తరలింపు ముమ్మాటికి తప్పే.

\- కణ్ణగి, జీవకోన



రోబోట్రాక్ పోటీల్లో తిరుపతి ఐఐటీ జట్టు విజయం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు - జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాలపల్లి రామమూర్తి

తిరుపతి, అర్బన్, ఫిబ్రవరి 18: ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, తిరుపతి చాప్టర్ సంయుక్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు రోబోట్రాక్ పోటీలను శని, ఆదివారంలో నిర్వహించారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు మొదటి పోటీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 10 జట్లు పాల్గొన్నాయి. తిరుపతి ఐఐటీకి చెందిన థండర్ బోల్ట్ బృందం రూ.5వేల నగదుతో పాటు సర్టిఫికెట్, మొదటి బహుమతి దక్కించుకుంది. ఒంగోలుకు చెందిన నూబ్ రోబోట్ బృందం రూ.3 వేల నగదుతో పాటు రెండవ బహుమతి దక్కించుకుంది. మూడో బహుమతి బెంగళూరులోని రామయ్య పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎస్-లాజిక్స్ బృందం దక్కించుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీయూ మాజీ వైస్ చాన్సలర్, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాలపల్లి రామమూర్తి ప్రారంభించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ సెంటర్ క్యూరేటర్ సుదీప్తో సాహో, సిబ్బంది పాల్గొన్నారు.

మేకల బండ నవల ఆవిష్కరణ



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 18: తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రముఖ రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచించిన మేకల బండ నవలను ఆవిష్కరించారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం సభా మందిరంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో శ్వేత సంచాలకులు డాక్టర్ భూమన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక భాషలో కథలు రాస్తూ ఉండిన కృష్ణస్వామి రాజు తొలిసారి పుత్తూరు పరిసర ప్రాంతాల నేపథ్యంతో నవల రాయడం విశేషమన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ నవలను సమీక్ష చేస్తూ గ్రామీణ జీవితంలోని కార్మికుల కష్టాలను చెప్పడానికి మేకలను ప్రతీకలుగా వాడుకుని రచయిత చక్కటి నవల రచించారని, సమకాలీన సమాజంలోని అనేక సమస్యలను ఇందులో చమత్కారంగా ప్రస్తావించారని అన్నారు. వెటర్నరీ కళాశాల సర్జరీ-రేడియాలజీ విభాగాధిపతి ఆచార్య ఆర్.వి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ గొర్రెలు పాత్రలుగా సమాజాన్ని విశ్లేంచిన తీరు బాగుందన్నారు. రచయిత మాట్లాడుతూ కథకుడిగా ఇప్పటి వరకు 15 పుస్తకాలు ప్రచురించానని, నవల రాయాలనే చిరకాల వాంఛతో గ్రామీణ నేపథ్యాన్ని, జంతువులను ప్రధాన పాత్రలుగా రాశానన్నారు. ఈ కార్యక్రమంలో కందారపు మురళి, నాగార్జున, ఆకుల మల్లేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, వి.కాంతారావు, రచయిత్రి ఉష, కలువగుంట రామమూర్తి, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, ఏనుగు అంకమనాయుడు, టెంకాయల దామోదరం పాల్గొన్నారు.

యాత్రికులు, లాడ్జి సిబ్బందికి ఘర్షణ

● ఒకరికి గాయాలు - పర్నిచర్ ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 18 : శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన యాత్రికులకు, వారు బసచేసిన లాడ్జి సిబ్బందికి ఘర్షణ చోటు చేసుకుంది. యాత్రిక బృందంలో ఒకరికి గాయాలు కావడంతో లాడ్జిలోని అద్దాలు, టీవీ, ప్రింటర్ తదితరాలను ధ్వంసం చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బెంగళూరుకు చెందిన 8 మంది యాత్రికుల బృందం పెద్దకాపు లేఅవుట్‌లోని శ్రీనివాసగ్రాండ్ లాడ్జిలో రెండు గదులను అద్దెకు తీసుకున్నారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో గదులను తీసుకుని, ఆదివారం ఉదయం 5 గంటలకు ఖాళీ చేయాల్సి ఉంది. అయితే స్నానం చేసేందుకు నీళ్లు లేకపోవడంతో గంట సమయం ఆలస్యంగా ఖాళీ చేశారు. ఆలస్యమైనందుకు కాస్త ఎక్కువ చెల్లించాలని లాడ్జి సిబ్బంది డిమాండ్ చేశారు. నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత లాడ్జివారిదేనని, నీళ్లు లేనందునే ఆలస్యమైందని భక్త బృందం వాదించింది. ఈ క్రమంలో లాడ్జి సిబ్బంది ఒకరు దాడి చేయడంతో భక్త బృందంలో వివేక్ అనే యువకుడికి గాయాలయ్యాయి. దీంతో భక్తులు లాడ్జిలోని పర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేస్తామని సీఐ వెల్లడించారు.

గీతామకరంద గుళికలు పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 18: నగరానికి చెందిన విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో డాక్టర్ అన్నయ్య నాయుడు తెలుగు పద్యాలలో రచించిన భగవద్గీత పుస్తకం గీతామకరంద గుళికలను ఆదివారం ఆవిష్కరించారు. రాస్ భవనంలో విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షతన సహస్రావధాని మేడసాని మోహన్, ఇస్కాన్ సంస్థ తిరుపతి పీఆర్‌వో లీలాపారాయణ దాసు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశ్రాంత ఆచార్యులు గోవిందస్వామినాయుడు గ్రంథ సమీక్ష చేశారు. రచయిత అన్నయ్య నాయుడు కృష్ణ భక్తిని చాటుకున్నారని, తేటగీతి పద్యాలలో, చక్కటి తెలుగు పదాలతో భగవద్గీతను అనువదించారని వక్తలు అభిప్రాయపడ్డారు. సంస్కృత శ్లోకాలు చదువుకోలేని వారికి ఈ అనువాదం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ప్రసిద్ధ నవలా రచయిత మధురాంతకం నరేంద్ర రచయితతో చిన్ననాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. చివరగా రచయిత స్పందన తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు, బంధుమిత్రులు రచయిత అన్నయ్యనాయుడును సత్కరించారు. డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి సభకు స్వాగతం పలుకగా, డాక్టర్ నెమిలేటి కిట్టన్న వందన సమర్పణ చేశారు. రచయిత బంధువులు, శిష్యులు, ఆచార్య రాజేశ్వరమ్మ, ఏనుగు అంకమనాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, గొడుగుచింత గోవిందయ్య, మూరిశెట్టి గోవిందు, డాక్టర్ ఆదిశేషయ్య, డాక్టర్ జీఎస్.ప్రసాద్, పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

తెప్పలపై రుక్మిణీ, సత్యభామ సమేత పార్థసారథిస్వామి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 18 : గోవిందరాజస్వామి తెప్పోత్సవాలలో భాగంగా రెండవ రోజైన ఆదివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత పార్థసారధి స్వామి తెప్పలపై విహరించారు. రాత్రి 8.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం 9.45 నుంచి 10.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరుమల పెద్దజీయరు స్వామి, ఆలయ ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌ను అవమానించడం బాధాకరం



మాట్లాడుతున్న జనసేన నేతలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు అవమానించేలా మాట్లాడడం బాధాకరమని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ జూపూడి శనివారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మాట్లాడుతూ విదేశీ విద్యా దీవెన పథకానికి అంబేడ్కర్ పేరును తొలగించి జగన్ పేరు పెట్టుకున్నా తమకు ఆనందమే అని చెప్పడం బాబాసాహెబ్‌ను అవమానించడమేనన్నారు. జూపూడి ప్రభాకర్ మాటలను వైసీపీ నేతలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. ఆయన మాటలను వెనక్కి తీసుకుని అంబేడ్కర్‌కు, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే రైతులు జగన్‌ను పూజిస్తున్నారన్న కారుమూరి నాగేశ్వరరావు మాటలను ఖండించారు. ఈ సమావేశంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, పార్థు, వంశీ, నవీన్, కిషోర్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డికి సన్మానం



తిరుపతిసిటీ, ఫిబ్రవరి 18: ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డిని ఆదివారం తిరుపతి జిల్లా కార్యవర్గం సన్మానించింది. రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య బంధాన్ని పెంచాలని, సీఎం మనసు మారేలా చేయాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించామన్నారు.జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, నగర కార్యదర్శి బాలాజీ, చిట్టిబాబు, మోహన్‌రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ స్థలంతో వైసీపీ నేతలకు సంబంధంలేదు

తిరుపతి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని ప్రైవేట్ భూములను వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారని సీపీఎం నేతలు ఆరోపించడం సరికాదని, ఇది పూర్తిగా తనకు, పెరుమాళ్‌కు మధ్య కోర్టులో జరుగుతున్న వివాదమని దివంగత సుబ్రమణ్యం నాయుడు కుమారుడు బి.నరేంద్ర స్పష్టం చేశారు. తాను కొనుగోలు చేసిన స్థలంపై పెరుమాళ్ వివాదం సృష్టించగా కోర్టును ఆశ్రయించానని (దావా నెంబరు 1120/2023) తన పేరిట ఇంజక్షన్ (ఐఎనెంబరు 329/2023) ఉత్తర్వులు వచ్చాయని అన్నారు. న్యాయస్థానం తీర్పు మేరకు తాత్కాలిక నిర్మాణం చేపడుతుండగా పెరుమాళ్ తనను బెదిరించి సీపీఎం నాయకుడు కందారపు మురళి తదితరులను తీసుకొచ్చి కూలదోశారన్నారన్నారు.సామాన్యులకు అండగా ఉండాల్సిన వామపక్ష నాయకులు పూర్వాపరాలు పరిశీలించకుండా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పైగా ఈ వివాదానికి రాజకీయ రంగు పులమడం బాధాకరమన్నారు. వైసీపీ సర్పంచ్‌కు గానీ, అతని తమ్ముడు నరేష్‌కు గానీ ఎలాంటి సంబంధం లేదన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గేటు పడితే అర్ధగంట ఆగాల్సిందే!

- బారులు తీరుతున్న వాహనాలు
- విద్యార్థులు, ఉద్యోగుల అవస్థలు
- ఆర్వోబీ, లేదా ఆర్‌యూబీ నిర్మించాలని విజ్ఞప్తి



రైల్వేగేటు మూసివేయడంతో ఆగివున్న వాహనాలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 18: వెంకటగిరి - నాయుడుపేట రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మేనకూరు, శ్రీసిటీ సెజ్‌లతో పాటు చెన్నై వెళ్లే వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ దారిలోనే కృషి విజ్ఞాన కేంద్ర, నిమ్మ, చీని పరిశోధన శాస్త్రం, ఏపీ మోడల్ స్కూల్ వంటివి ఉన్నాయి. దీంతో ఉద్యోగులతో పాటు విద్యార్థులు పెద్దసంఖ్యలో వచ్చిపోతుంటారు. ఈ రహదారిపై రైల్వే గేటు ఉంది. ప్రతిరోజూ దాదాపు నలభై నుంచి యాభై రైళ్లు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ గేటు మూసివేస్తుంటారు. ఒక్కసారి గేటు పడితే కనీసం పావు గంట సేపు వాహనాలు ఆగిపోతున్నాయి. కొన్నిసార్లు ఒక రైలు వెళ్లాక, ఇంకో రైలు వచ్చేదాకా గేటు తీయడం లేదు. దీంతో సుమారు అర్ధగంట వరకు వాహనాలు బారులుతీరుతున్నాయి. దీంతో పరిశ్రమలకు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్, లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా రైల్వే శాఖ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకుని వెంకటగిరి ఈ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ, లేదా ఆర్‌యూబీ నిర్మించి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలి



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అరాచ కపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అభివృద్ధిని మరచి, దోచుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. వైసీపీ అరాచకాలను తట్టుకోలేక పలువురు టీడీపీలో చేరుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, మనిశేఖర్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, దశరథరామిరెడ్డి, ఏడుకొండలు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనా దక్షుడు చంద్రబాబు
సినీ నటుడు సుమన్



మీడియాతో మాట్లాడుతున్న సుమన్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: 'నాకు రాజకీయ గురువు, రాజకీయ ఓనమాలు నేర్పింది చంద్రబాబు. మంచి పరిపాలన దక్షత కలిగిన వ్యక్తి' అని ప్రముఖ సినీ నటుడు సుమన్ ప్రశంసించారు. ఆదివారం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఐదునెలల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు గుంటూరు జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, తాను తెలంగాణ వ్యక్తిని కాబట్టి వద్దని చెప్పానన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని అభ్యర్థించారు. రాజమండ్రి ఎంపీగా పోటీ చేయాలని వైసీపీ కూడా అవకాశం ఇచ్చినా, తెలంగాణలో ఉండటం వల్ల నిరాకరించానన్నారు. ప్రతిపక్షాలు క్యాలిక్యులేషన్, అండర్‌స్టాండింగ్, సీట్ షేరింగ్, క్యాస్ట్ మేటర్ కరెక్టుగా లేకుంటే మళ్లీ వైసీపీనే అధికారంలోకి రావడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రజలు మెచ్చే మేనిఫెస్టోలు ప్రకటించిన పార్టీకే మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు. తమిళనటుడు విజయ్ రాజకీయ పార్టీ పెట్టడాన్ని ఆహ్వానిస్తున్నానని చెప్పుకొచ్చారు. అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చారిత్రాత్మకమని, ప్రధాని మోదీ దర్శనం చేసుకున్న తర్వాత తనకే శ్రీరాముని దర్శన భాగ్యం దక్కడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఇక దేశంలో మహిళలకు రక్షణ లేదని చెప్పారు. విదేశాల తరహాలో మహిళలకు రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అయితే అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు.

నేడు గూడూరులో స్పందన

గూడూరు, ఫిబ్రవరి 18: గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

20న రక్తదాన శిబిరం

కోట, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని విద్యానగర్‌లో గల నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో ఈనెల 20వ తేదీన రక్తదాన శిబిరం జరుగుతుందని స్థానిక ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి జయంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్, డీఎస్‌ఆర్ ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, గూడూరు ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించడం జరుగుతుందన్నారు.

వెండి ఆభరణాల స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి 5 కిలోల వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వచ్చే మెమో రైలులో అనుమతి పత్రాలు, సరైన బిల్లులు లేకుండా తరలిస్తున్న 5 కిలోల వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు గుర్తించి పట్టుకొని స్వాధీనం చేసుకొన్నట్లు సమాచారం. రైల్వే పోలీసులు మాత్రం పూర్తి వివరాలు ఇంకా వెల్లడించలేదు.



గూడూరు, సూళ్లూరుపేట బస్టాండ్లలో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

సీఎం సభకు బస్సులు... ప్రయాణికుల పాట్లు

గూడూరు, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభ కోసం ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు నానాపాట్లు పడ్డారు. గూడూరు డిపోలో 45 బస్సులు ఉండగా 30 బస్సులను సీఎం సభకు తరలించారు. మిగిలిన 15 బస్సులను పరిమిత ప్రాంతాలకు నడిపారు. దీంతో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడాల్సివచ్చింది. గూడూరు బస్టాండులో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు వారి గమ్యస్థానాలకు చేరాల్సిన బస్సులు సరైన సమయానికి రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడాల్సివచ్చింది. రైల్వేజంక్షన్ కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు రైళ్లలో ఇక్కడికి చేరుకుని తమ గమ్యస్థానాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళుతుంటారు. ప్రధానంగా గూడూరు నుంచి నెల్లూరు, తిరుపతి, చెన్నై, వెంకటగిరి, రాపూరు వెళుతుంటారు. అయితే బస్సుల సంఖ్య తగినంత లేకపోవడంతో పాటు రద్దీ పెరగడంతో కూర్చునేందుకు సీట్లు దొరకక ప్రయానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సివచ్చింది. అదేవిధంగా వాకాడు డిపోలో 40 బస్సులు ఉండగా సిద్ధం సభకు 21బస్సులను తరలించడంతో వాకాడు, కోట ప్రాంతాల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు

సూళ్లూరుపేట: రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభ కోసం తరలించడంతో సూళ్లూలరుపేట డిపో నుంచి 20 బస్సులను తరలించారు. డిపోలో ఉన్నవే మొత్తం 37 బస్సులు. ఇందులో 12 అద్దె బస్సులు ఉన్నారు. సీఎం సభకు 20 బస్సులు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సెలవు దినంతో పాటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు బస్సుల్లేక నానా తంటాలు పడ్డారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి వెళ్లాల్సి వచ్చింది. నెల్లూరు, తిరుపతి నగరాలకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభకు వెంకటగిరి డిపో నుంచి 26 బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

యాత్రికులు, లాడ్జి సిబ్బందికి ఘర్షణ
ఒకరికి గాయాలు - ఫర్నిచర్ ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 18: శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన యాత్రికులకు, వారు బసచేసిన లాడ్జి సిబ్బందికి ఘర్షణ చోటుచేసుకుంది. యాత్రిక బృందంలో ఒకరికి గాయాలు కావడంతో లాడ్జిలోని అద్దాలు, టీవీ, ప్రింటర్ తదితరాలను ధ్వంసం చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బెంగళూరుకు చెందిన 8 మంది యాత్రికుల బృందం పెద్దకాపు లేఅవుట్‌లోని శ్రీనివాసగ్రాండ్ లాడ్జిలో రెండు గదులను అద్దెకు తీసుకున్నారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో గదులను తీసుకుని, ఆదివారం ఉదయం 5 గంటలకు ఖాళీ చేయాల్సి ఉంది. అయితే స్నానం చేసేందుకు నీళ్లు లేకపోవడంతో గంట సమయం ఆలస్యంగా ఖాళీ చేశారు. ఆలస్యమైనందుకు కాస్త ఎక్కువ చెల్లించాలని లాడ్జి సిబ్బంది డిమాండ్ చేశారు. నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత లాడ్జివారిదేనని, నీళ్లు లేనందునే ఆలస్యమైందని భక్త బృందం వాదించింది. ఈ క్రమంలో లాడ్జి సిబ్బంది ఒకరు దాడి చేయడంతో భక్త బృందంలో వివేక్ అనే యువకుడికి గాయాలయ్యాయి. దీంతో భక్తులు లాడ్జిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేస్తామని సీఐ వెల్లడించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 71,021 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఉడిపికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు సుధీర్‌తీర్థ, రమణతీర్థ, తెలంగాణ ఎమ్మెల్యే వెంకట నర్సింగరావు, సినీ హీరోయిన్ ఆషిక రంగనాథ్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

డక్కిలి, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుష చర్య అని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, డక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించారు. వైసీపీ రాక్షస పాలకు ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. నిందితులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

చెంగాళమ్మకు బంగారు కాసుల దండ



కాసుల దండను అందజేస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 18: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి పట్టణానికి చెందిన నన్నం ఏడుకొండల కుటుంబ సభ్యులు 95 గ్రాముల బంగారు కాసుల దండను విరాళంగా ఆదివారం అందజేశారు. అదేవిధంగా శ్రీసిటీకి చెందిన శంకర్ 7 గ్రామల బంగారు తాళిబొట్టు, నల్లపూసల దండను ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి సమక్షంలో ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

42 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం
9 మందిని బదిలీ చేసిన డీఐజీ అమ్మిరెడ్డి ● వీఆర్‌లో ఉన్న 33 మందికి పోస్టింగులిచ్చిన ఎస్పీ మలిక గర్గ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 18 : జిల్లాలో 42 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. వీరిలో 9 మంది ఎస్‌ఐలను వివిధ ప్రదేశాలకు బదిలీ చేస్తూ అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. అలాగే తిరుపతి వీఆర్‌లో ఉన్న 33 మంది ఎస్‌ఐలకు పోస్టింగులిస్తూ ఎస్పీ మలిక గర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. దిశ పోలీస్ స్టేషన్ నుంచి అటాచ్‌మెంట్‌పై సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న డి. లావణ్యను తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎం.అరుణ(తిరుపతి ఎస్‌బీ) శ్రీకాళహస్తి ఒన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. ఐ.హిమబిందు (చంద్రగిరి) తిరుపతి ఎస్‌బీకి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి 2టౌన్ నుంచి అటాచ్‌మెంట్‌పై సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఆర్. విజయ కుమార్ నాయక్ భాకరాపేట ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఒ.రామస్వామి (సీసీఎస్ తిరుపతి) అలిపిరి స్టేషన్‌కు, శ్రీకాళహస్తి ఒన్‌టౌన్ నుంచి అటాచ్‌మెంట్‌పై తిరుచానూరు స్టేషన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న టి.వెంకట సుబ్బయ్య తిరుచానూరు స్టేషన్‌కు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించారు. టి.సాయినాథ్ చౌదరి (తిరుమల 2టౌన్) తిరుపతి సీసీఎస్‌కు, ఎ.హరిప్రసాద్ (శ్రీసిటీ) తిరుపతి ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌కు, ఎ.చిరంజీవి (తిరుచానూరు) ఆర్సీ పురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక తిరుపతి వీఆర్‌లో 33మంది ఎస్‌లను ఎస్పీ వివిధ స్థానాల్లో నియమించారు. కె.శ్రీకాంత్ శ్రీసిటీ ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఎ.విజయ భాస్కర్‌రాజు (శ్రీకాళహస్తి 2టౌన్), ఎ.జావీద్ బాషా 9రేణిగుంట), జి.శ్రీనాథ్ ప్రసాద్ (తిరుపతి వెస్ట్), కె.జయరామ్ నాయక్ (తిరుపతి ట్రాఫిక్), బి.వెంకట రమణ (ఏర్పేడు), పి.విజయభాస్కర్ నాయుడు (శ్రీకాళహస్తి రూరల్), టి.శివప్రసాద్ (శ్రీకాళహస్తి 2టౌన్), పి.మురహరి బాబు (తిరుపతి ఈస్ట్), జి.శ్రీరామప్రసాద్ (తిరుపతి ట్రాఫిక్), కె.నాగమాణిక్యం (పీసీఆర్, తిరుపతి), డి.బలరాజు (తిరుపతి వెస్ట్), ఎ.నాగరాజు (తిరుపతి సీసీఎస), ఎ.అల్లాబక్ష్ (శ్రీకాళహస్తి రూరల్), డి.చంద్రశేఖర్ (సీసీస్ తిరుపతి), ఎస్.ఇషాక్ బాషా (పాకాల), సి.బాబు (శ్రీకాళహస్తి 1టౌన్), డి.లక్ష్మీనారాయణ (ఎస్‌బీ తిరుపతి), ఎస్.జయరామప్ప (ఎస్వీయూ తిరుపతి), కేఎల్ కళావతి (డీసీఆర్బీ తిరుపతి), ఎస్.అబ్దుల్ కలామ్ ఆజాద్ (తిరుపతి ట్రాఫిక్), కె.రెడ్డప్ప (తిరుపతి ట్రాఫిక్), పి.వెంకటరమణ (తిరుమల సీసీఎస్), కె.ఆంజనేయ ప్రసాద్ (పీసీఆర్ తిరుపతి), కె.శివశంకర్ (ఎయిర్‌పోర్ట్), బి.తులసన్న (తిరుపతి వెస్ట్), జి.బాలరాజు (తిరుపతి ఎస్‌బీ), కె.శ్రీరాములు (తిరుమల ట్రాఫిక్), జి.వెంకటరమణ (తిరుపతి ఎస్‌బీ), ఎస్.ఎ.రఫీక్ (పీఆర్ తిరుపతి), పి.శ్రీనివాసులు (సత్యవేడు), ఎ.దాదాపీర్ (తిరుపతి ఎసీబీ) బాధ్యతలు చేపట్టనున్నారు.

పుట్టాలమ్మ సన్నిధిలో టీడీపీ నేతల పూజలు



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: శ్రీకాళహస్తి మండలం రామాపురం గ్రామంలో వెలసిన కట్ట పుట్టాలమ్మకు మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ, పలువురు సీనియర్ టీడీపీ నాయకులు పూజలు చేశారు. ఆదివారం టీడీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు కామేష్ యాదవ్ కట్ట పుట్టాలమ్మ ఆలయంలో పొంగళ్ల సమర్పణ చేశారు. ఇందులో భాగంగా బృందమ్మతోపాటు నియోజకవర్గంలోని పలువురు సీనియర్ నాయకులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బృందమ్మ భోజనం సమయంలో టీడీపీ నాయకులతో నియోజకవర్గంలో ఎన్నికల కార్యాచరణ పై చర్చించారు.

పీఎస్ మాల్‌కు ఘనంగా భూమిపూజ



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 18: ఎమ్మార్‌పల్లిలో పంగులూరి సీతమ్మ వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఉప మేయర్ భూమన అభినయ్ పాల్గొన్నారు. తమ సహాయ సహకారాలు అందిస్తామని, ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తొలివిడతగా ఐదు అంతస్తులతో విశాలమైన భవన సముదాయం నిర్మిస్తున్నారు. సీతమ్మ భూముల అభివృద్ధికి ఆర్యవైశ్యులు ముందుకు రావాలని, వీలునామాలో ఉన్న విధంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి కొండూరి మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బా చంద్రశేఖర్, ముర్రంశెట్టి రాములు, ముప్పల నరసింహులు, శిరీష, కామిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే జన్మ సార్థకం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: సేవతోనే మానవ జన్మ సార్థకం అవుతుందని యంగ్ ఎంప్లాయి సోషల్ సర్వీస్ అధ్యక్షుడు హేమ కుమార్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో వంద మంది రోగులకు దుప్పట్లు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో మధు, సభ్యులు సాయికిరణ్, నారాయణ, షరీఫ్, శ్రీనివాసులు, సురేంద్ర, చంద్ర, ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయం ఖాయం



బంగారమ్మ ఆలయంలో భాను ప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అవినీతి, అరాచక ప్రభుత్వంతో పోరాడుతున్న టీడీపీకి వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయమని ఆ పార్టీ నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ చెప్పారు. ఆదివారం మండలంలోని ఎస్‌వీపురంలో బంగారమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని దుష్టశక్తుల నుంచి కాపాడు తల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో భానుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రం దిశ, దశ నిర్దేశం లేని నావలా మారిందన్నారు. వడమాలపేట మండలాన్ని గాలి ముద్దుకృష్ణమనాయుడు ఎలా అభివృద్ధి చేశారో గుర్తుచేశారు. తన తండ్రి బాటలో నడుస్తూ అభివృద్ధి చేస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు శ్రీలీల



తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ శ్రీలీల శ్రీవారి దర్శనార్థం ఆదివారం కాలినడకన తిరుమలకు వచ్చారు. రాత్రి 7 గంటలకు అలిపిరిలో కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరి తిరుమలకు చేరుకున్నారు. జీఎంఆర్ అతిథిగృహంలో బస చేశారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

పుత్తూరు వార్తలు

శ్మశానానికి స్థలం కేటాయించండి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 18: రంగుగుంట ఎస్టీ కాలనీ శ్మశానానికి స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు వెంకటేష్ డిమాండ్ చేశారు. పుత్తూరు మండల పరిధిలోని తడుకు పంచాయతీలోని రంగగుంట ఎస్టీ కాలనీవాసులు చాలా సంవత్సరాలుగా శ్మశాన స్థలంగా వినియోగించుకుంటున్న ప్రాంతాన్ని కొందరు ఆక్రమించుకున్నారని చెప్పారు. ఆదివారం కాలనీకి చెందిన తుపాకుల అంకమ్మ చనిపోవడంతో ఆమె శవాన్ని తీసుకు వెళ్తుంటే రైతులు అడ్డుపడ్డారని అన్నారు. ఎస్టీ కాలనీకి శ్మశాన స్థలం చూపాలని దళితులు ధర్నా నిర్వహించారు. పుత్తూరు తహసీల్దారుకు సమాచారం ఇవ్వగా, ఆయన డీటీ స్వరూప, గ్రామ సర్వేయర్ నవీన్ ఘటనా స్థలానికి పంపించారు. సర్వే చేసి శ్మశానానికి స్థలం కేటాయిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, బాలయ్య, భీమయ్య, వల్లెమ్మ, నాగమ్మ, కన్నెమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్లో రోబోట్రాక్ పోటీలు

తిరుపతి, అర్బన్, ఫిబ్రవరి 18: ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, తిరుపతి చాప్టర్ సంయుక్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు రోబోట్రాక్ పోటీలను శని, ఆదివారంలో నిర్వహించారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు మొదటి పోటీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 10 జట్లు పాల్గొన్నాయి. తిరుపతి ఐఐటీకి చెందిన థండర్ బోల్ట్ బృందం రూ.5వేల నగదుతో పాటు సర్టిఫికెట్, మొదటి బహుమతి దక్కించుకుంది. ఒంగోలుకు చెందిన నూబ్ రోబోట్ బృందం రూ.3 వేల నగదుతో పాటు రెండవ బహుమతి దక్కించుకుంది. మూడో బహుమతి బెంగళూరులోని రామయ్య పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎస్-లాజిక్స్ బృందం దక్కించుకుంది.

అవినీతికి అడ్డాగా నగరి నియోజకవర్గం: భానుప్రకాష్



షాపువీధిలో ప్రచారంలో నిర్వహిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 18: అవినీతి, దోపిడీ, దౌర్జన్యాలకు నగరి నియోజకవర్గం అడ్డాగా మారిందని టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. ఆదివారం పట్టణ పరిధిలోని 17, 18వ వార్డులు షాపువీధి, దళితవాడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప రెండుసార్లు వైసీపీ గెలిచి ఏమి సాధించిందని నిలదీశారు. ఒక్క పరిశ్రమైనా నియోజకవర్గానికి వచ్చిందా అని ప్రశ్నించారు. నెలకు రూ.5 వేలు చేతిలో పెట్టి అడ్డమైన చాకిరీ వలంటీర్లతో చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత డీఎస్సీ కోసం ఐదేళ్లు వేచి చూస్తే ఎన్నికల ముందు హడావిడిగా ఆరు వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఇవ్వడం, పైగా ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వకపోవడం జగన్ ప్రభుత్వానికి విద్యారంగంపైన, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంపైన ఉన్న చిత్తశుద్ధిని తెలియచేస్తోందన్నారు. అవినీతికి భయపడి నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని, ఉన్న ఫ్యాక్టరీలు కూడా మూతబడ్డాయని దుయ్యబట్టారు. పుత్తూరు ప్రజలు శాంతిని కోరుకుంటారని, అలాంటి పుత్తూరులో ఇప్పుడు శాంతిభద్రతల పరిస్థితి దిగజారిపోయిందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ఓటు వేసి ఆశీర్వదించాలని స్థానికులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్‌కు అడుగడుగునా మహిళలు పూలదండలు, దుశ్శాలువతో ఘనంగా సన్మానించి మంగళహారతులిచ్చారు.

టీడీపీలో చేరిన కో ఆప్షన్ సభ్యుడు

మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆనంగి చీరాల తన వర్గీయులతో కలిసి టీడీపీలో చేరారు. ఆయనకు భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో దళిత వర్గాలకు, బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం: సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 18: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను రద్దు చేసి, యాజమాన్యలను అనుకూలంగా వ్యవహరిస్తోందని, కార్మిక వర్గం ఏకమై కార్మిక చట్టాలను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలో విశ్రాంత సంఘ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు రెండవరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి, ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి, సరసమ్మ, ధనకోటి, మమత తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు


ముక్కంటి దర్శనం కోసం బారులు తీరని భక్తులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయంత్రం రాహుకాల సమయంలో రాహుకేతు సర్ప దోష నివారణ పూజల కోసం భక్తులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 27వేల మంది భక్తులు ముక్కంటిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

కనకదుర్గమ్మ కు విశేష పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలం పై వెలసిన కనకదుర్గమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి దీపారాధన చేసి, సామూహిక లలితా సహస్ర నామపారాయణం చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దక్షిణ కాళికాదేవి ఆలయంలో...

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు జరిపి, నిమ్మకాయలు, పూల మాలతో అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకు మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

కోడిపందెంస్థావరాలపై దాడి
● ఐదుగురి అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 10: శ్రీకాళహస్తి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో కోడిపందెంస్థావరాలపై దాడులు నిర్వహించి ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద 9కోళ్లు, 3సెల్‌ఫోన్లు,ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శ్రీకాళహస్తిరూరల్ సిఐ అజయ్ తెలిపారు.

బంగారమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కేవీబీపురం ఫిబ్రవరి18: మండలంలోని ఆరే గ్రామం వద్ద వేంచేసి ఉన్న బంగారమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం కేవీబీపురం గ్రామానికి చెందిన గోపి ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

సొంత నిధులతో గంగమ్మ గుడి నిర్మాణం


గంగమ్మ గుడి నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్

కేవీబీపురం ఫిబ్రవరి18: మండలంలోని తిమ్మసముద్రం గిరిజన కాలనీలో ఆదివారం ఆ గ్రామ టీడీపీ సర్పంచ్ దొరబాబు నాయుడు గంగమ్మ గుడి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఎంతో కాలంగా కాలనీలో గుడి లేక గిరిజనులు ఇబ్బందులు పడుతుండగా వారి పరిస్థితికి స్పందించిన సర్పంచ్ తన సొంత నిధులను గుడి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు తమ వంతు సాయంగా శ్రమదానం చేస్తామన్నారు. దీంతో ఆదివారం పనులుప్రారంభించారు.

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక


శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ కమిటీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో జరిగింది శ్రీకాళహస్తి అధ్యక్షుడిగా రమణయ్య ,గౌరవాధ్యక్షుడిగా పిల్లారి బత్తినయ్య, అంకయ్య, రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా గోవిందస్వామి, ఉపాధ్యక్షులుగా వెంకటరత్నం, నాగరాజు, సుబ్రహ్మణ్యం ప్రచార కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం యువత అధ్యక్షుడిగా ఆకుల గురుమూర్తి, పట్టణ అధ్యక్షుడిగా కోనేటి అయ్యప్ప తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు రమణయ్య ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి తొలి విరాళంగా రూ.5 లక్షల చెక్కు అందజేశారు. నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులను నియమించాలని ప్రత్యక్ష రాజకీయ పదవులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన వివిధ రాజకీయ పార్టీలను కోరారు. ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 500 మార్కులు పైన వచ్చిన ముదిరాజ్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు.

ఉమ్మడి ప్రభుత్వంతోనే యువతకు భవితవ్యం


ఇంటింటి ప్రచారం చేస్తున్న వినుత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తో యువతకు మంచి భవిత వ్యం లభిస్తుందని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి వినత అన్నారు. పట్టణంలోని కుమ్మరి వీధి, కుం దేటి వారి వీధిలో టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో పై ఇంటింటికి ప్రచా రం చేశారు. నాయకులు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ


సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభా వంతులకు నిత్యవసర సరుకులు వితరణ చేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయం వద్ద నిర్వాహకులు మునీర్ భాష ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యవసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రావణి, బాబా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే జీతాలివ్వాలి: ఏఐటీయూసీ

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 18: పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్నం భోజనం, పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. వరదయ్యపాళెం మండలంలోని మధ్యాహ్న భోజనం కార్మికులు, పాఠశాల స్కావెంజర్స్ మండల కమిటీ సమావేశం ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్ర ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మధ్యాహ్నం భోజనానికి బిల్లు పెంచాలని ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్ సప్లయ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల స్కావెంజర్స్‌కు శానిటేషన్ మెటీరియల్స్, చీపురు కట్టలు సకాలంలో ఇవ్వాలని, ఈ సమస్యలు పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం తీర్మానించింది జ్యోతి, మేఘన, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మీ వెన్నంటే ఉంటాం
● ఆదిమూలంకు బ్రహ్మరథం పట్టిన అభిమానులు


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న యువకులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 18: మీకు పదవి ఉన్నా లేకున్నా మీ వెన్నంటే ఉంటామని నీరువాయి గ్రామానికి చెందిన యువకులు, మహిళలు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంతో అన్నారు. ఆదివారం మండలంలోని పిచ్చాటూరు ఇందిరానగర్, నీరువాయి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామ పొలిమేరలో యువకులు ఎమ్మెల్యేకు గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పదవీకాలం పూర్తి కానప్పటికీ ఇతరులను సమన్వయకర్తలుగా నియమించి నియోజకవర్గంలో పర్యటనలు చేయించడం, నాకు మాట మాత్రమేనా చెప్పకుండా తిరుపతిలో మంత్రి ఇంటిలో సమావేశం ఏర్పాటు చేసి అభ్యర్థిని ప్రకటించడం చాలా బాధకలిగించిందన్నారు. అనంతరం ఇటీవల మరణించిన నీరువాయికి చెందిన రామచంద్రనాయుడు, ఇందిరానగర్‌కు చెందిన ఏసు చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కేశవన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా వైసీపీ కండువా వేశారు
● టీడీపీ సీనియర్ నాయకుడు బత్తెయ్య యాదవ్ ఆవేదన



ఏర్పేడు, ఫిబ్రవరి 18: 'మేర్లపాక గ్రామంలో శనివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్ర మం నిర్వహించారు. నేను ఇంట్లో ఉండగా వైసీపీ నాయకులొచ్చి.. నా మెడలో బలవంతంగా వైసీపీ కండువా వేశారు. ఎమ్మెల్యే, ఎంపీలను నా పక్కన నిలబెట్టి ఫొటో తీసుకున్నారు. ఆ తర్వాత వైసీపీలోకి చేరినట్లు ప్రచార మాధ్యమాల్లో పెట్టేశారు. ఇది మంచి పద్ధతి కాదు. నేను 20 ఏళ్లుగా టీడీపీ కుటుం బ సభ్యుడిగా ఉన్నా. నేను చనిపోయేంతవరకు తెలుగుదేశం పార్టీని వీడను' అని ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామానికి టీడీపీ సీనియర్ నాయకుడు చింతా బత్తెయ్య యాదవ్ ఆదివారం విడుదల చేసిన ఓ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయనీయం


శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణ పై దాడి హేయనీయమని... వైసీపీ తీరుపై సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం రాప్తాడులో సీఎం జగన్ ప్రసంగిస్తుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ అల్లరి మూకలు సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారు. క్రూర మృగాలను తలపించేలా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణ పై విరుచుకుపడి పైశాచికంగా దాడి చేశారు.ఈ వీడియో, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున వైరల్‌గా మారాయి. ఏ గ్రూపులో చూసినా నెటిజెన్లు వైసీపీ హింసా కాండను ఎండ కట్టారు. ఇక పలువురు ప్రముఖులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.



సిగ్గుచేటు

ఆ వీడియో చూస్తూనే... శరీరం జలదరించింది. వైసీపీ నేతలు ఎంతగా చెలరేగిపోతున్నారో చెప్పడానికి ఇదే నిదర్శనం. పత్రికా స్వేచ్ఛను కాలరాయడం సిగ్గుచేటు. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. -జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి వినుత

కఠినంగా శిక్షించాలి



కనీస మానవత్వాన్ని మరిచి రెచ్చిపోయిన వైసీపీ అరాచక శక్తులను అధికారులు కఠినంగా శిక్షించాలి. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి ఏమాత్రం సమంజసం కాదు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకూడదు. వీడియోలో దాడి చేసిన దుండగులు అత్యంత స్పష్టంగా కనిపిస్తున్నారు. అధికారులు చిత్తశుద్ధితో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్

సమాజ హితులపై పైశాచికమా...?



సమాజహితుల్లో పాత్రికేయులది ప్రథమ స్థానం. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న పత్రిక స్వేచ్ఛను అందరూ గౌరవించాలి. సమాజ హితుడిపై వైసీపీ నాయకులు దానికి తెగబడడం దుర్మార్గం. వైసీపీ సంస్కార హీనతకు ఇది ఒక ఉదాహరణ - బొజ్జల బృందమ్మ

వినాశకాలే విపరీత బుద్ధి



వైసీపీ వినాశనం అయ్యే కాలం సమీపించడంతోనే తన విపరీత బుద్ధి ప్రదర్శిస్తోంది. నిస్వార్థ సేవకులైన పాత్రికేయులను ప్రతి ఒక్కరు గౌరవించాలి. వారి హక్కులకు భంగం కలిగించడం నేరం. ఆటవిక జంతువుల తరహాలో పాత్రికేయుడుపై అమానుషంగా దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను. -మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు

పోలీసు యంత్రాంగం ఏమైంది ?



రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం నిర్వీర్యమైంది అనడానికి ఇదే నిదర్శనం. సాక్షాత్తు సీఎం సభలో పాత్రికేయుడు పై వైసీపీ నాయకులు విశృంఖల విహారం చేస్తుంటే పోలీసులు ఏమయ్యారు. ఇది వైఫల్యమా లేక అధికార పార్టీకి దాసోహమా అర్థం కావడం లేదు.
-సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య.

అసలు మనుషులేనా...?



ఈ ఘాతకాన్ని చూస్తే... దాడి చేసిన వారు అసలు మనుషులేనా అన్నంతగా బాధ కలిగింది. ఇలాంటి ఘటనలను ఉపేక్షించడం తగదు. అన్ని వర్గాల ప్రజలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణకు అండగా నిలవాలి. వైసీపీని భూస్థాపితం చెయ్యకపోతే జనాన్ని ప్రశాంతంగా బతకనివ్వరు
- మాజీ ఎమ్మెల్యే సత్ర వాడ ముని రామయ్య

ముక్కంటి సేవలో ప్రముఖులు


ముక్కంటి ఆలయంలో జస్టిస్ రామచంద్ర రావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: ముక్కంటి ఆలయాన్ని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ రామచంద్రరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దక్షిణ గాలిగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేదాశీర్వాదం చేశారు. కాగా పూణేకి చెందిన ఉత్తరా దేవి చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరరావు ముక్కంటిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

విశ్వనాథ రెడ్డికి కళానిధి పురస్కారం


అవార్డు అందుకుంటున్న విశ్వనాథరెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కలంకారీ కళాకారుడు విశ్వనాథరెడ్డి కళానిధి అవార్డు అందుకున్నారు. హర్యానాలో ఆదివారం సూరజ్ కుండ్ అంతర్జాతీయ హస్తకళ మేళ జరిగింది. ఇందులో భాగంగా కలంకారి విభాగంలో విశ్వనాథరెడ్డి ప్రదర్శనకు గుర్తింపు లభించింది. ఈ మేరకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా విశ్వనాథ్ రెడ్డి పురస్కారం అందుకున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా విశ్వనాథరెడ్డికి పలువురు ఘనంగా అభినందనలు తెలిపారు.

ముక్కంటి ఆలయ పైకప్పులో మరమ్మతులు



లీకేజీలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం - ఆలయం పై భాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: ముక్కంటి ఆలయ పైకప్పు నుంచి లీకేజీలు అరికట్టేందుకు ఆదివారం మరమత్తులు ప్రారంభించారు. కొద్ది సంవత్సరాలుగా వర్షాల సమయంలో ఆలయం పైకప్పు నుంచి లీకేజీలు పెరిగిపోయాయి. ఈ సమస్యపై పూణేకి చెందిన ఉత్తరాదేవి చారిటబుల్, రీసెర్చ్ ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరరావు స్పందించారు. రూ 3.60 కోట్ల సొంత నిధులతో పైకప్పుకు మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు పూణేకి చెందిన ఆర్కియాలజీ అధికారులు, ఐఐటి నిపుణుల ఆధ్వర్యంలో ఇటీవల ఆలయాన్ని పరిశీలించారు. సిమెంటు, కెమికల్స్ రహితంగా పూర్వకాల సహజ పద్ధతిలో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అదే ప్రకారం దాత వెంకటేశ్వరరావు నిపుణుల బృందంతో ఆదివారం ఆలయానికి చేరుకున్నారు. అధికారుల సమక్షంలో మరమ్మత్తు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూకరత్నమ్మ, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళాభ్యున్నతి


తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి కుమారి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18: టీడీపీతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని శ్రీకాళహస్తి పట్టణ తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి కుమారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గత నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మహిళలపై దాడులు హత్యలు జరిగాయని వాపోయారు. శ్రీకాళహస్తి లో మహిళలపై దాడులకు స్వస్తి పలకాలంటే గోపాలకృష్ణారెడ్డి పాలన తిరిగి తెచ్చుకోవాలని, శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాల కృష్ణారెడ్డి తనయుడు సుధీర్ రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కంబాకంలో అడుగంటిన చెరువులు

● ఎండిపోతున్న వరి ● ఇప్పటికే 50ఎకరాలు పంటలను వదిలివేసిన రైతులు
● అరకొర విద్యుత్ సరఫరాతో అవస్థలు ● గంగ నీరందించి పంటలను కాపాడాలని వేడుకుంటున్న అన్నదాతలు



వరి పైరు ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేసిన రైతులు


చెరువులో అడుగంటిన నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 18: మండలంలోని కుక్కంబాకం గ్రామం చెరువులోని నీరు అడుగంటిపోవడంతో వరి పంటలు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఐదు చిన్న చెరువుల కింద రబీలో సుమారు 1000ఎకరాల్లో వరి వేశారు. సాధగుంట చెరువులో నీరు లేకపోవడంతో 20 రోజుల క్రితం 50ఎకారాల్లో వేసిన వరి పంటలను రైతులు వదిలేయడంతో అదికాస్త పశువులకు మేతగా మారింది. ఇక చిట్టావారికండ్రిగ, కొత్త చెరువు, చిన్న చెరువు, ఖైనవానిగుంట, నల్లచెరువులో వారం రోజులకు సరిపడా నీరు మాత్రమే ఉందని రైతులు తెలిపారు. ప్రస్తుతం పంట పొట్ట స్థాయిలో ఉందని నీరందకపోతే పంట ఎండిపోవడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలల్లో అప్పులు చేసి పంటలు వేశామని నీరు లేక ఎండిపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు. బోర్లు కింద పంటలు వేసిన రైతులు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. వ్యవసాయానికి నిరంతరంగా పగలు పూట 9గంటలు ఇస్తున్నామని ప్రభుత్వం ప్రటించినప్పటికీ అది ఆచారణలో కనిపించడం లేదు. ప్రస్తుతం 7గంటలుఇస్తున్నామని చెప్పిన ట్రాన్స్‌కో అధికారులు రెండు గంటల పాటు నిరంతరాయంగా కూడా ఇవ్వడం లేదని, ఒకపక్క ఎండలు, మరో పక్క నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలుగుగంగ నీరు అందించి పంటలను కాపాడాలి

తెలుగుగంగ నీరును అందించి వరి పంటలను కాపాడాలి. చెరువుల్లో నీరు ఒక వారానికి సరపడ్డా నీరు ఉంది. వరి పంటలు ఎండిపోతున్నాయని తెలుగు గంగ నీరు అందించాలని ఇప్పటికే అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. ప్రతి యోటా తెలుగుగంగ నీరు వలన పంటు పండించుకుంటున్నాం, అధికారులు పంటలను పరిశీలించి నీరు అందించే ఏర్పాట్లు చేయాలి
- సుబ్రమణ్యం రైతు కుక్కంబాకం

నిరంతరంగా విద్యుత్‌ను అందించాలి

వ్యవసాయనికి అందిస్తున్న విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలి. రెండు గంటలు కూడా సక్రమంగా కరెంటు వదలకపోవడం వలన బోర్లు కింద వేసిన పంటలు ఎండిపోతున్నాయి. కరెంటు కోసం రాత్రి పగలు మోటరు దగ్గర ఎదురు చూపులు చూస్తున్నాం. - బత్తెయ్య, రైతు కుక్కంబాకం